సాక్షి మంచిర్యాల

మంగళవారం । 23 । మే । 2023



'సూపర్ స్పెషాలిటీ'కి మొండిచేయి

రిమ్స్ సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు పేదలకు ఇప్పట్లో అందేలా కనిపించడం లేదు. ఆస్పత్రిని ప్రారంభించిన ప్రభుత్వం వైద్యుల పోస్టుల భర్తీని మాత్రం విస్మరించింది.

10లో▸

గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

బెల్లంపల్లి: గ్రంథాలయాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్ అన్నారు. సోమవారం బెల్లంపల్లి శాఖ గ్రంథాలయంలో ఏసీలను ప్రారంభించారు. రూ.4 లక్షలు వెచ్చించి 8 ఏసీలు కొనుగోలు చేశామని. వీటిలో 6 బెల్లంపల్లిలో, మరో 2 మంచిర్యాల జిల్లా గ్రంథాలయంలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. లైబ్రేరియన్ గోపి. పాఠకులు. బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
41.0 /28.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. రాత్రివేళ మేఘావృతమై ఉంటుంది. ఉత్తరం దిశగా వడ గాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సమన్వయంతో సమస్యలు పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌తో కలిసి అర్జీలు స్వీకరించారు. అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. భూ సమస్యలు, పింఛన్, విద్యుత్ స మస్య, కల్యాణలక్ష్మి, భూ నష్టపరిహారం తదితర స మస్యలపై ప్రజలు అర్జీలు అందజేశారు. కల్యాణలక్ష్మి చెక్కు అందజేయాలని లక్సెట్టిపేట మండలం శాంతపూర్ గ్రామానికి చెందిన అవునూరి లక్ష్మి ఫి ర్యాదు చేసింది. శిశువు మృతికి కారణమైన మాతాశి శు కేంద్రం ఏఎస్ఎం వెంకటమ్మపై చర్యలు తీసుకోవాలని మహేష్, కుటుంబ సభ్యులు అర్జీ అందజేశారు. తాండూర్ మండలం పెగడపల్లి గ్రామ శివా రులోని సర్వే నంబరు 55, 55/1లో 2.16 ఎకరాల భూమిని ప్రభుత్వం 40ఏళ్ల క్రితం ఇచ్చిందని, పా స్‌పుస్తకం తన పేరిట ఉందని, భూమి ఆక్ర మించుకునేందుకు అడిగే చిన్నయ్య కుటుంబం తనపై దా డి చేస్తున్నారని గ్రామానికి చెందిన కంబాల మల్లు ఫిర్యాదు చేసింది. సిరమిక్ ఫ్యాక్టరీ పక్కన ప్రభుత్వ భూమిలో ఇళ్ల స్థలాలు కేటాయించాలని తాండూర్ మండలం కొత్తపల్లి గ్రామ పంచాయతీ పరిధి రేపల్లివాడ వాసులు వినతిపత్రం అందజేశారు.

ఎస్సీలకు కేటాయించిన భూమి ఎవరికీ ఇవ్వొద్దు..

హాజీపూర్ మండలం బుద్దపల్లి గ్రామ శివారులో సర్వే నంబరు 76లో ఎస్సీలకు ప్లాట్లు కేటాయించిన 3.5ఎకరాల భూమిని ఎస్సీ కార్పొరేషన్‌కు కొనుగోలు చేసింది. అప్పటి నుంచి ధాన్యం సేకరణ ఐకేపీ సెంటర్, పశువుల మేపడానికి ఉపయోగిస్తున్నాం. ఈ భూమి తమది అంటూ కోడిత్యాల దివ్య, భర్త ప్రభాకర్ వారసత్వంగా వస్తుందని పేర్కొంటూ గ్రామ పంచాయతీకి నోటీసులు ఇచ్చారు. ఎస్సీలకు కేటాయించిన భూమిని ఎవరికీ ఇవ్వకుండా మాకే చెందేలా చూడాలి.

– బుద్దపల్లి గ్రామస్తులు

సీఎం కప్ పోటీలు ప్రారంభం



క్రీడాజ్యోతిని ప్రదర్శిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పట్టణంలో జిల్లా స్థాయి సీఎం కప్ పోటీలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు జరిగే ఈ పోటీలకు 18 మండలాల నుంచి క్రీడాకారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, కలెక్టర్ బాదావత్ సంతోష్, బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం క్రీడాపతాకాలను ఆవిష్కరించారు. వివిధ జట్లు గౌరవ వందనాన్ని సమర్పించాయి. క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. తొలిరోజు వాలీబాల్, కబడ్డీ అంశాల్లో క్రీడలు జరిగాయి. బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. ఎండ ఎక్కువగా ఉండటంతో ఉదయం 11 గంటల వరకే పోటీలు నిర్వహించి తిరిగి ఫ్లడ్‌లైట్ల వెలుతురులో సాయంత్రం కొనసాగించారు. అడిషనల్ కలెక్టర్ రాహుల్, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, డీవైఎస్ఓ శ్రీకాంత్‌రెడ్డి, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ, మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి, పట్టణ ఎస్ఐ అశోక్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అబ్దుల్‌అజీజ్, ఇన్‌చార్జి గాండ్ల సమ్మయ్య పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు టీకాలు



హజ్ యాత్రికులకు టీకాలు వేస్తున్న వైద్యులు

మంచిర్యాలటౌన్: జిల్లా నుంచి హజ్ యాత్రకు వెళ్తున్న 33మందికి మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సోమవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో టీకాలు వేశారు. హజ్ యాత్రికులు తప్పనిసరిగా రెండు రకాల టీకాలు వేసుకోవాల్సి ఉండగా, ఏటా హైదరాబాద్‌లోనే వేసేవారని డీఎంహెచ్ఓ డాక్టర్ సుబ్బరాయుడు తెలిపారు. ఈ ఏడాది నుంచి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోనే వేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, ప్రోగ్రాం ఆఫీసర్, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ అనిత, ఆర్ఎంవో శ్రీమన్నారాయణ, డాక్టర్ రమేశ్, డాక్టర్ అరుణశ్రీ, డాక్టర్ శ్వేత, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

తెగని భూ పంచాయితీ!



ఈయన పేరు దుర్గం రాజయ్య. మందమర్రి మండలం తిమ్మాపూర్ శివారు 140 సర్వే నంబరులో 0.15 గుంటల భూమి ఉండగా రికార్డుల్లో 1.15ఎకరాలుగా మార్చి రిజిస్ట్రేషన్ చేశారు. దీంతో ఇదే సర్వే నంబరులో ఉన్న రాజయ్యకు చెందిన ఆరు గుంటలతోపాటు మరో ఇద్దరికి చెందిన 33గుంటలు కలిపేసుకుని అక్రమంగా కబ్జా చేస్తున్నారని రెండేళ్ల క్రితమే ఫిర్యాదు చేశారు. ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో ఈ నలుగురు మధ్య వివాదం అలాగే కొనసాగుతోంది. ఆక్రమణదారులపై చర్యలు లేవు. అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో విచారణ జరిపి న్యాయం చేయాలని కోరుతున్నాడు. సోమవారం మరో మారు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశాడు.



సమస్యలపై ఫిర్యాదులు చేయడానికి కలెక్టర్ చాంబర్ వద్ద బారులు తీరిన అర్జీదారులు

- అనేక చోట్ల వివాదాల్లోనే భూములు
- కార్యాలయాల చుట్టూ బాధితుల ప్రదక్షిణ
- ప్రతీ వారం గ్రీవెన్స్‌లో భూ సమస్యలే అధికం
- అధికారుల చొరవతోనే పరిష్కారం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లాలో భూ వివాదాలు తెగడం లేదు. అనేకమంది యాజమాన్య హక్కులు రాక భూ సమస్యలతో సతమతం అవుతున్నారు. సాగు, సాగేతర భూముల యాజమాన్య హక్కుల్లో ఏర్పడిన చిక్కులతో ఇబ్బందులు పడుతున్నారు. పట్టాపాస్ బుక్ ఉంటే రైతుబంధు, బీమా, ఎరువులు, పంటను అమ్మడం, రుణాలు, తదితర హక్కులు ఉంటాయి. దీంతో యాజమాన్య హక్కులు రాక ఇవన్నీ కోల్పోతున్నారు. జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాలు, కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం జరిగే ప్రజాఫిర్యాదుల (గ్రీవెన్స్) విభాగంలో ఎక్కువగా భూ వివాదాలపైనే ఫిర్యాదులు వస్తున్నాయి. ఏదో ఓ భూ సమస్యతో అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఇందులో కొందరు రెండేసి, మూడేసి సార్లు పరిష్కారం కోసం అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేసినా ఫలితం ఉండడం లేదు. ఇందులో ఆర్వోఆర్ నుంచి ధరణి వచ్చే వరకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్య జటిలమై ఇరువర్గాల మధ్య చిచ్చు పెడుతున్నాయి. కొన్ని సమస్యల్లో కుటుంబ, వారసత్వ, హద్దులు, విస్తీర్ణం తేడాలు, డబుల్ రిజిస్ట్రేషన్లు, పొజిషన్స్, పట్టాదారులతో వివాదాలు ఉన్నాయి. ఇదే ఆసరాగా మధ్య దళారులు, కొందరు ప్రజాప్రతినిధులు, పలుకుబడి ఉన్న నాయకులు, రియల్ వ్యాపారులు తమకు అనుకూలంగా పరిస్థితిని మలుచుకుని వ్యాపారం చేస్తున్నారు. మరోవైపు ధరణిలో ఇప్పటికీ అనేక సమస్యలకు పరిష్కారం లేక భూ హక్కుదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎప్పటికప్పుడు కొత్త మాడ్యుల్స్ ప్రవేశపెట్టినప్పటికీ ఇంకా అనేక సమస్యలకు పరిష్కారం చూపడం లేదు. .

భూ లిటిగేషన్లతో దందా

ఇక కొందరు భూ లిటిగేషన్లతో దందా సాగిస్తున్నారు. అధికారులు, చట్టాల్లోని లొసుగులు, కోర్టు ఆర్డర్లు తదితర వాటిని తమకు అనుకూలంగా మలుచుకుంటూ ప్రత్యర్థులను బెదిరిస్తూ దందాలు చేస్తున్నారు. జిల్లా కేంద్రంతోపాటు శివారు భూములు, మండలాలు, గ్రామాల్లో భూ సమస్యలు తీర్చుతామంటూ దళారులు బాధితుల నుంచి డబ్బులు గుంజుతున్నారు. లేకపోతే వివాదంలో ఉన్న వాటిని తక్కువ ధరలకు కొనుగోలు చేసి, సమయం చూసి అధిక ధరలకు అమ్మేస్తున్నారు. ఇక అసైన్డ్, ప్రభుత్వ భూముల వివాదంలోనూ ఎడతెగకుండా వివాదాలు ఉన్నాయి. జిల్లా కేంద్రం చుట్టూ ఇప్పటికే అనేక ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యాయి. వీటిని తిరిగి తీసుకోవడంలో అటు అధికారులు విఫలమయ్యారు. ఇందులో రెవెన్యూతోపాటు సాగునీటి, విద్యా, అటవీ, తదితర శాఖల భూములు ఉన్నాయి. చాలా చోట్ల రీ సర్వే చేస్తే లిటిగేషన్ల బాగోతం బయటపడే అవకాశం ఉంది. ఎప్పటికప్పుడు జాప్యం చేస్తుండడంతో భూ సమస్యలు ఎప్పటికీ తీరడం లేదు. దీంతో కొన్ని చోట్ల నేరాలకు దారి తీస్తున్నాయి.

ఠాణాల్లో 'సివిల్'..

సివిల్ వివాదాల్లో పోలీసులకు సంబంధం లేనప్పటికీ చాలామంది స్థానిక పోలీసుస్టేషన్లకు పరిష్కారం కోసం వెళ్తున్నారు. రెవెన్యూ ఆఫీసు తర్వాత అధికంగా ఠాణాలకే వెళ్తున్నారు. కొన్ని చోట్ల అనధికారింగా పోలీసులు పంచాయితీలు చేస్తుండగా, మరికొన్ని చోట్ల పట్టించుకోవడం లేదు. ఎవరైనా ప్రజాప్రతినిధి చెబితే చేస్తున్న వారు కూడా ఉన్నారు. దీంతో తమకు న్యాయం చేయాలని, ప్రత్యర్థులకు వ్యతిరేకంగా ఫిర్యాదులు చేస్తున్నారు. ఇక కొందరు అధికారులు ఇరువర్గాలను పిలిచి సమస్యకు పరిష్కారం చూపుతున్నారు. అలాగే భూ సమస్యలపై స్థానిక రెవెన్యూ అధికారులకు రాస్తున్నారు.

కలెక్టరేట్ పనులు పూర్తి చేయాలి



పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే దివాకర్

నస్పూర్: నస్పూర్ పట్టణంలో కలెక్టరేట్ భవన నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని కలెక్టర్ బి.సంతోష్ సూచించారు. సోమవారం ఆయన జిల్లా అటవీశాఖ అధికారి శివ్ ఆశిష్‌సింగ్, జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్, మంచిర్యాల ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావుతో కలిసి పనులను పరిశీలించారు. జిల్లా శాఖల కార్యాలయాల గదులు, సమావేశ మందిరం, ఫిర్యాదు దారుల గది సందర్శించారు.

పుస్తకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్

నస్పూర్: ముఖ్య ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన సామాజిక, ఆర్థిక ముఖచిత్రం–2023 పుస్తకాన్ని కలెక్టర్ సంతోష్ జిల్లా అటవీశాఖ అధికారి శివ్‌ఆశిష్‌సింగ్, ముఖ్యప్రణాళిక అధికారి జి సత్యంలతో కలిసి సోమవారం ఆవిష్కరించారు.

పర్యావరణ పరిరక్షణ బాధ్యత



ప్లాస్టిక్ ఏరివేసిన అటవీ అధికారులు

జన్నారం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఇందన్‌పల్లి రేంజ్ అధికారి హఫీజొద్దీన్, జన్నారం రేంజ్ అధికారి లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం పర్యావరణ హిత జీవన విధానం కార్యక్రమంలో భాగంగా జన్నారం అటవీ డివిజన్‌లోని జన్నారం, ఇందన్‌పల్లి, తాళ్లపేట్ అటవీ రేంజ్‌లలో అటవీశాఖ సిబ్బంది ప్లాస్టిక్ వస్తువులను ఏరివేశారు. డిప్యూటీ రేంజ్ అధికారి తిరుపతి, సెక్షన్ అధికారులు శివకుమార్, రవి, సర్పంచులు పాల్గొన్నారు.

గాలివానకు ఆస్పత్రి ధ్వంసం



రోగులు ఉండే గదిలో ధ్వంసమైన పడకలు

- మరమ్మతు పనుల్లో జాప్యం
- ఇబ్బందుల్లో రోగులు
- పట్టించుకోని అధికారులు

లక్సెట్టిపేట: మండల కేంద్రం లక్సెట్టిపేటలోని ప్రభుత్వ సివిల్ ఆస్పత్రి తాత్కాలిక భవనం గాలివానకు ధ్వంసమైంది. ఆదివారం రాత్రి బలమైన ఈదురు గాలులు, వర్షానికి ఆస్పత్రిలోని రోగులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఉరుములు, మెరుపులు, పిడుగులతో వర్షం కురవడంతో రోగులు, సిబ్బంది చీకట్లో రాత్రంతా గడిపారు. ప్రభుత్వ సివిల్ ఆస్పత్రికి పక్కా భవనం మంజూరు కాగా ఇటీవల మంత్రి హరీష్‌రావు శంకుస్థాపన చేశారు. ప్రజలకు వైద్యం అందించేందుకు తాత్కాలికంగా పాత ఎంపీడీవో కార్యాలయంలో రేకుల షెడ్డును ఏర్పాటు చేశారు. ఇందుకోసం సుమారు రూ.15లక్షలు మరమ్మతులకు వెచ్చించినట్లు తెలిసింది. రంగులు, మరుగ దొడ్లు, ఇతర సౌకర్యాలు కల్పించారు. పైన ఉన్న సిమెంటు రేకులు పగిలి ఉన్నాయి. వాటిని తొలగించి కొత్త రేకులు వేసేందుకు నాలుగు రోజుల క్రితం సిమెంటు రేకులు తొలగించి అలాగే వదిలేశారు. ఆదివారం రాత్రి గాలివానకు ఆస్పత్రిలోని విలువైన సామగ్రి ధ్వంసమై రూ.20లక్షల నష్టం వాటిల్లినట్లు వైద్యులు తెలిపారు. రోగులను వరండాలోకి మార్చి వైద్యం అందిస్తున్నారు. రేకులు వేయడంలో జాప్యం జరగడంతో ఆస్పత్రి అధ్వానంగా మారింది. షార్ట్ సర్క్యూట్ జరిగి ఫ్యాన్లు, ఫ్రిడ్జ్‌లు, ఇన్వర్టర్, ఇతర విద్యుత్ ఉపకరణాలు కాలిపోయాయి. విద్యుత్ అంతరాయం ఏర్పడింది. మందులు, ల్యాబ్‌లోని వస్తువులు, రిజిష్టర్లు తడిసిపోయాయి. మరమ్మతులు పూర్తయిన తర్వాత రోగులను తరలించాల్సి ఉండగా.. అసౌకర్యాల మధ్య ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శలు వస్తున్నాయి.



రోగులకు వరండాలో వైద్యం

ఎప్పుడు పూర్తవుతుందో..!

నూతన భవనం ఇంకా పిల్లర్ల దశలోనే ఉంది. మూడు మండలాల రోగులకు లక్సెట్టిపేట సివిల్ ఆస్పత్రిలో వైద్యసేవలు అందిస్తారు. మంత్రి వస్తున్నారని హడావుడిగా పనులు చేసి అధికారులు, ప్రజాప్రతినిధులు మమ అనిపించారు. ఆస్పత్రి భవనం ఎప్పుడు పూర్తవుతుందోనని, అంతవరకు రోగులకు సేవలు ఎలా అందించాలని వైద్యులు ఆందోళన చెందుతున్నారు.

ఇబ్బందిగా ఉన్నది..



పై రేకులు తొలగించి నాలుగు రోజుల వుతున్నా పట్టించుకోలేదు. ఒక్కసారిగా గాలివాన రావడంతో ఆస్పత్రి పూర్తిగా ధ్వంసమైంది. రికార్డులు తడిసిపోయాయి. రోగులు, ఆసుపత్రి సిబ్బంది చాలా ఇబ్బందులు పడ్డారు. ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతోనే నష్టం వాటిల్లింది. ప్రతీరోజు కాంట్రాక్టర్‌కు తెలిపరిచినా పట్టించుకోలేదు. చాలా నష్టం వాటిల్లింది.

– ఆసుపత్రి వైద్యాధికారి శ్రీనివాస్, లక్సెట్టిపేట

మల శుద్ధి కేంద్రం ఏర్పాటయ్యేనా..!



ఆండాళమ్మ కాలనీ వద్ద ఎఫ్ఎస్‌టీపీ కోసం కేటాయించిన స్థలం

- జిల్లా కేంద్రంలో ఏర్పాటుకు అడ్డంకులు
- మంజూరై ఏడాది దాటినా ముందుకు సాగని పనులు
- స్థలాన్ని కేటాయించగానే స్థానికుల ఆందోళన
- నిర్మిస్తే పర్యావరణ పరిరక్షణ

మంచిర్యాలటౌన్: మున్సిపాల్టీలను పరిశుభ్రంగా ఉంచేందుకు చేపడుతున్న చర్యల్లో భాగంగా మానవ మల వ్యర్థాలతో ఎరువుల తయారీకి ప్రభుత్వం ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంటు ప్లాంటు(ఎఫ్ఎస్‌టీపీ)లు ఏర్పాటు చేస్తోంది. ఇందులో భాగంగా మంచిర్యాల మున్సిపాల్టీలోనూ ఏడాదిన్నర క్రితమే ఎఫ్ఎస్‌టీపీ ఏర్పాటుకు సాయికుంటలో స్థలాన్ని కేటాయించింది. ప్లాంటు ఏర్పాటును స్థానికులు వ్యతిరేకించడంతో పనులు ముందుకు సాగలేదు. రూ.కోటి వ్యయంతో చేపట్టే ఈ కేంద్రం వల్ల ఈ ప్రాంత ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని అధికారులు వివరించినా ఆందోళన కొనసాగడంతో పనులు నిలిపివేశారు. ఏడాది తర్వాత గతనెలలో పాత మంచిర్యాలలోని ఆండాళమ్మ కాలనీ సమీపంలో డంపింగ్ యార్డు పక్కనే ఎకరం స్థలంలో ప్లాంటు పనులు చేపట్టారు. ఆండాళమ్మ కాలనీ ప్రజలూ అడ్డుకోవడంతో ప్రారంభ దశలోనే పనులు నిలిచిపోయాయి. మున్సిపాల్టీ పరిధిలో ప్రభుత్వ స్థలాలకు కొరత లేకున్నా, ప్లాంటు నిర్మానం ఎక్కడ చేపట్టాలనే దానిపై పాలకవర్గం సరైన నిర్ణయం తీసుకోకపోవడం, స్థలం కేటాయించిన స్థానికుల అభ్యంతరాలకు సరైన సమాధానం చెప్పకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు.

అవగాహన కల్పిస్తేనే..

ప్లాంటు నిర్మాణం వల్ల సమీప ప్రాంత ప్రజలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని, పర్యావరణ పరిరక్షణ, పారిశుధ్యం మెరుగుపర్చేందుకు చేపడుతున్న ప్లాంటు నిర్మాణంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంది. మానవ వ్యర్థాలను మల శుద్ధి కేంద్రాలకు తరలించి, శుద్ధి చేసి ఎరువులుగా మార్చే ప్రక్రియను వివరిస్తేనే వీటి నిర్మాణానికి ప్రజల నుంచి వ్యతిరేకత ఉండదు. ప్రస్తుతం పట్టణంలోని సెప్టిక్ ట్యాంకులు నిండగానే ప్రత్యేక వాహనాల ద్వారా మల వ్యర్థాలను పట్టణ శివారులోని ఖాళీ ప్రదేశాలు, స్థానిక వాగులు, కాలువల్లో పారబోస్తున్నారు. అలా కాకుండా మల వ్యర్థాలను ఎరువుగా మార్చేందుకే ఈ ప్లాంటు నిర్మించనున్నారు. ప్లాంటు నిర్మాణం పూర్తయితే ఆవరణలో ఆహ్లాదాన్ని కలిగించేలా, పూర్తి పర్యావరణ హితంగా నిర్మాణం ఉండనుంది. సిట్రస్ గార్డెనింగ్ పేరిట ఉద్యానవనాన్ని అభివృద్ధి చేయడంతోపాటు మల వ్యర్థాలను శుద్ధి చేసిన తర్వాత బయటకు వచ్చిన నీటిని ప్లాంట్ ఆవరణలోని మొక్కలకు, ఘన వ్యర్థాన్ని వ్యవసాయ అవసరాలకు ఉపయోగపడే ఎరువుగా మార్చేలా ప్లాంటు నిర్మిస్తారు. స్వచ్ఛ సర్వేక్షన్ పేరిట దేశంలోని మున్సిపాలిటీలకు ర్యాంకులు ఇస్తుండగా, ఎఫ్ఎస్‌టీపీ నిర్మాణం ద్వారా స్వచ్ఛ సర్వేక్షన్ ర్యాంకు మరింత మెరుగుపడేందుకు అవకాశం ఉంది.

స్థానికులకు ఇబ్బంది లేకుండా నిర్మాణం



మంచిర్యాల మున్సిపాలిటీలో ఎఫ్ఎస్‌టీపీ వల్ల స్థానికులకు ఇబ్బంది లేకుండా నిర్మాణం చేపడతాం. ప్రస్తుతం ఆండాళమ్మ కాలనీలో ఎకరం భూమిని కేటాయించాం. స్థానికులకు అవగాహన కల్పించడంతోపాటు ఎక్కడ నిర్మాణం చేపట్టాలనే దానిపై త్వరలో నే నిర్ణయం తీసుకుంటాం. ప్రజలకు ఎఫ్ ఎస్‌టీపీతో ఎలాంటి సమస్య ఉండదు. పర్యావరణ పరి రక్షణ కోసం చేపడుతున్న దీని నిర్మాణం వల్ల స్థానికులకు ఇబ్బందులు ఉండవని వివరిస్తాం.

– మారుతి ప్రసాద్, మంచిర్యాల మున్సిపల్ కమిషనర్

'పది'లో లెక్క తప్పింది..

- ఫెయిలైన విద్యార్థులపై విద్యాశాఖ ఆరా
- అత్యధికంగా గణితం, సైన్స్‌లో అనుత్తీర్ణత

మంచిర్యాలఅర్బన్: పదో తరగతి ఫలితాలపై విద్యాశాఖ దృష్టి సారించింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఫెయిలైన విద్యార్థుల స్థితిగతులపై ఆరా తీసింది. అనుత్తీర్ణతకు కారణాలేమిటి.. ఏయే సబ్జెక్టుల్లో ఫెయిలయ్యారు.. ఎక్కడ తప్పిదం జరిగిందనే వివరాలు సేకరించారు. జూన్ 14 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులను గట్టెక్కించేందుకు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ప్రతియేటా జూన్ 2నుంచి బడిబాట కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ సమయంలోనే సప్లిమెంటరీ పరీక్షలకు విద్యార్థుల సన్నద్ధతపై ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఎందుకు ఫెయిలయ్యారంటే..

పాఠశాలల వారీగా పదో తరగతి ఫలితాల్లో ఫెయిల్ కావడానికి వివరాలు సేకరించారు. కరోనా కారణంగా పై తరగతులకు ప్రమోట్ చేసిన విద్యార్థుల్లో పదో తరగతి బ్యాచ్ ఒకటి. ఎనిమిది, తొమ్మిదో తరగతిలో ఆన్‌లైన్ బోధనతో పాఠ్యాంశాలు బోధించారు. పాఠాలు అర్థంకాక విద్యార్థులు చదువులో వెనుకబ డినట్లు తెలుస్తోంది. ఇటీవల 'పది' ఫలితాల్లో గణి తం తర్వాత సైన్స్ విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంది. గణితంలో 1,162మంది అనుత్తీర్ణులయ్యారు. ఇటీవల విద్యాశాఖ సేకరించిన వివరాల్లో గణితంలో తప్పిన విద్యార్థులు 332మంది నిదానం(వేగం లేకపోవడం)గా చదువుతున్నట్లు తేలింది. 240 మంది బడికి హాజరు కాని వారు ఉన్నారు. 80మందికి చదువులు ఇష్టం లేకపోవడం, కుటుంబ సభ్యులతో కలి సి పొలం, ఇతరత్రా పనులకు వెళ్లడం, 37 మంది అనారోగ్యం బారిన పడడం, నలుగురు విద్యార్థులు కుటుంబ సమస్యలతో ఫెయిల్ కావడానికి కారణాలుగా తెలుస్తోంది. సప్లిమెంటరీ పరీక్షల నేపథ్యంలో పరీక్ష రాసేందుకు ఎంతమంది సంసిద్ధులుగా ఉ న్నారో తెలియదు. ఏడాది పొడవునా బడికిరాని వి ద్యార్థులు ప్రత్యక్ష, ఆన్‌లైన్ క్లాసులు నిర్వహిస్తే హా జరవుతారా..? అనే విషయాలపై విద్యాశాఖ అధికా రులు బేరీజు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఎలాగైనా సప్లిమెంటరీలో ఉత్తమ ఫలితాలు సాధించేలా చర్యలు వేగవంతం చేశారు.

సైన్స్ విద్యార్థులు..

పదో తరగతి పరీక్షల్లో 10,076 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 8,552 మంది ఉత్తీర్ణత సాధించారు. 1,524 మంది ఫెయిలయ్యారు. ఉపాధ్యాయుల కొరతను అధిగమించేందుకు సర్దుబాటు చేసినా ఫలితాల్లో వెనకబడ్డారు. 472 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలున్నాయి. ఇందులో 134 మందిని డిప్యూటేషన్‌పై స ర్దుబాటు చేశారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులను హైస్కూల్‌లో డిప్యూటేషన్‌తో బోధన సాగించినా ఫలితం లే కుండా పోయింది. ఇందులో అధికంగా 1,162 మంది లెక్కల్లో తికమకపడి అను ఉత్తీర్ణులయ్యారు. ఆ తర్వాత సైన్స్‌లో 603 మంది ఫె యిల్ కాగా, ఇంగ్లిష్‌లో 396 మంది తప్పారు. తెలుగులో కూడా 207 మంది ఫెయిల్ కావడం ఆలోచనలో పడేస్తోంది. 156 సోష ల్, 68 మంది విద్యార్థులు హిందీ పరీక్షల్లో ఫెయిలయ్యారు.

'ఎర్రజెండా పార్టీలు ఏకం కావాలి'



మాట్లాడుతున్న కలవేన శంకర్

పాతమంచిర్యాల: దేశ ప్రయోజనాలు కాపాడడానికి ఎర్రజెండా పార్టీలు, అన్ని రకాల శక్తులు ఏకం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతోన్మాద శక్తులను నిలువరించడానికి సీపీఐ దేశవ్యాప్తంగా 'ఇంటింటికి సీపీఐ' కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించామని తెలిపారు. అర్హులకు రేషన్‌కార్డులు, డబులబెడ్రూం ఇళ్లు, పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని జూన్ 4న కొత్తగూడెంలో ప్రజాగర్జన భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలి పారు. బహిరంగ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి ఖలిందర్ అలీఖాన్, సీఐ టీయూ జిల్లా కార్యదర్శి మేకల దాసు, జిల్లా సమితి సభ్యులు జోగుల మల్లయ్య, దేవి పోచన్న, మిరియాల రాజేశ్వర్‌రావు, మొగిలి లక్ష్మణ్, చాడా మహేందర్‌రెడ్డి, ఎలిగేటి వజ్ర, అఫ్రోజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్



మాట్లాడుతున్న డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్

మంచిర్యాలక్రైం: నకిలీ విత్తనాల సరఫరా, విక్రయాలు చేస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని మంచిర్యాల డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ హెచ్చరించారు. సోమవారం స్థానిక డీసీపీ కార్యాలయంలో జిల్లాలో ఇప్పటివరకు నకిలీ విత్తనాలు కేసుల్లో నిందితులుగా ఉన్న 96 మందిని పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు. నకిలీ విత్తనాల దందా అరికట్టేందుకు వ్యవసాయ, పోలీస్, రెవెన్యూ అధికారులతో స్పెషల్ టాస్క్‌ఫోర్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నకిలీ విత్తనాల అక్రమ రవాణాపై 100 డయల్‌కు సమాచారం అందించాలని తెలిపారు. అనంతరం నకిలీ విత్తనాల అక్రమ రవాణా నివారణకు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి, బెల్లంపల్లి రూరల్ సీఐ రాజ్‌కుమార్, తాండూర్ సీఐ జగదీశ్, టాస్క్‌ఫోర్సు సీఐ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైలు కింద పడి ఒకరి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కాగజ్‌నగర్‌రూరల్‌: మండలంలోని వంజీరి రైల్వేగేటు సమీపంలో సోమవారం గుర్తుతెలియని రైలు నుంచి కిందపడి ఒకరు మృతి చెందాడు. రాళ్లపేట–సిర్పూర్‌ కాగజ్‌నగర్‌ రైల్వేస్టేషన్‌ల మధ్య వంజీరి రైల్వేగేటు వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు రైల్వే హెడ్‌ కానిస్టేబుల్‌ సురేశ్‌గౌడ్‌ తెలిపారు. మృతుడు 30 నుంచి 35 ఏళ్ల వయస్సు ఉంటాడని, నీలి కలర్‌ ఫుల్‌షర్ట్‌, చాక్లెట్‌ కలర్‌ ప్యాంట్‌ ధరించి ఉన్నాడని, కుడి చేతికి తెల్లని కడియం, మెడలో స్టీల్‌చైన్‌, కుడి చేతిపై మరియమ్మ అని కన్నడంలో రాసి ఉందని పేర్కొన్నాడు. మృతదేహాన్ని సిర్పూర్‌ (టి) ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చినట్లు తెలిపారు.

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

దహెగాం: మండలంలోని రాళ్లగూడ గ్రామంలో సీఐ నాగరాజు ఆధ్వర్యంలో పలువురు ఇళ్లలో సోమవారం సోదాలు నిర్వహించారు. బిమన్‌కర్‌ పురుషోత్తం ఇంట్లో 9 కిలోలు, వగాడె చినబాపు ఇంట్లో 11 కిలోల నకిలీ పత్తి విత్తనాలు, వగాడె బాపురావ్‌ ఇంట్లో 100 లీటర్ల నిషేధిత గడ్డి మందు, 55 ప్యాకెట్ల గడ్డి మందు పట్టుకున్నట్లు ఎస్సై సనత్‌కుమార్‌ తెలిపారు. వీటిని స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. పరారీలో ముగ్గురు ఉన్నారన్నారు. వాటి విలువ రూ.2.25 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు.

నాసిరకం విత్తనాలు, ఎరువులు అమ్మితే చర్యలు

తాండూర్‌: రైతులకు నకిలీ, నాసిరకం విత్తనాలు, ఎరువులను విక్రయిస్తే దుకాణ యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంచిర్యాల డీసీపీ సుధీర్‌ రాంనాథ్‌ కేకన్‌ హెచ్చరించారు. సోమవారం తాండూర్‌లోని బాలాజీ ఫర్టిలైజర్స్‌ షాపులో తనిఖీ చేశారు. గోదాంలో నిల్వ ఉన్న విత్తనాలు పరిశీలించారు. స్టాక్‌, అమ్మకం వివరాలు, రిజిష్టర్‌, బిల్లుల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ విత్తనాలు, ఎరువుల విక్రయానికి సంబంధించి విధిగా రశీదులు ఇవ్వాలని ఆదేశించారు. తాండూర్‌ సీఐ జగదీష్‌, బెల్లంపల్లి రూరల్‌, మందమర్రి సీఐలు రాజ్‌కుమార్‌గౌడ్‌, మహేందర్‌ రెడ్డి, మంచిర్యాల టాస్క్‌ఫోర్స్‌ సీఐ అశోక్‌కుమార్‌, పోలీసులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

కాగజ్‌నగర్‌రూరల్‌: పట్టణంలోని కాపువాడలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఆరెగూడ నివాసి అంకతి జగత (63) ఆస్పత్రిలో చికిత్స మృతి చెందింది. వివరాలు ఇలా.. మండలంలోని ఆరెగూడ గ్రామస్తులు ఆదివారం మంచిర్యాల జిల్లా భీమిని మండలంలోని ఎల్లారంలో పుట్టివెంట్రుకల వేడుకలో పాల్గొన్నారు. ఆటోలో తిరిగి ఇంటికి పయనమయ్యారు. కాగజ్‌నగర్‌ పట్టణంలోని కాపువాడ వద్ద ట్రాక్టర్‌, ఆటోను ఢీకొనడంతో ముద్దసాని సీనయ్య అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్ర గాయాలైన జగతను మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతిచెందింది. గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

విత్తనాల ఎంపికే కీలకం

ఉమ్మడి జిల్లాలో మరో 15 రోజుల్లో వానాకాలం సాగు ప్రారంభం కానుంది. రైతులు విత్తనాలు, ఎరువులు సమాకూర్చుకునే సమయం దగ్గరపడింది. పత్తితో పాటు కంది, పెసర, వరి, కూరగాయలకు సంబంధించి నకిలీ విత్తనాలు మార్కెట్‌లో వస్తున్నాయి. ఆయా కంపెనీల యాజమాన్యాలు జిల్లాలోని డీలర్లకు రకరకాల ప్యాకేజీలు ఆఫర్‌ చేస్తున్నాయి. గ్రామాల్లో డీలర్లు, కంపెనీ సిబ్బంది వాహనాల్లో వచ్చి కరపత్రాలు, వాల్‌పోస్టర్‌, మైక్‌సెట్‌ ద్వారా ప్రచారం సాగిస్తున్నారు. కంపెనీల ప్రకటనలు, ప్రచారాలకు నమ్మి రైతులు విత్తనాలు కొనుగోలు చేస్తే నష్టపోయే ప్రమాదం ఉంది. రైతులు ఒకటి రెండుసార్లు ఆలోచించి నిర్ధారణకు వచ్చాకే కొనుగోలు చేయాలి. విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త రాజశేఖర్‌, చెన్నూర్‌ ఏడీఏ జాడి బాపు చెబుతున్నారు. నాణ్యమైనవి, గుర్తింపు పొందిన విత్తనాలు కొనాలని సూచిస్తున్నారు.

– మంచిర్యాలఅగ్రికల్చర్‌/చెన్నూర్‌రూరల్‌

- ఒకటికి రెండుసార్లు ఆలోచించూ అన్నదాత
- నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దు
- గుర్తింపు పొందిన విత్తనమే మేలు


జొన్న విత్తనాలు


జాడి బాపు, ఏడీఏ, చెన్నూర్‌

విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు..

- విత్తన ఎంపికలో, ఎరువుల కొనుగోలులో రైతులు జాగ్రత్తలు పాటించాలని ఆదిలాబాద్‌ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త శ్రీధర్‌ చౌహాన్‌ సూచనలు అందిస్తున్నారు.
- వ్యవసాయ శాఖ ద్వారా లైసెన్స్‌ పొందిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- గడువు దాటినా విత్తనాలు, చిరిగిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుంచి ఇచ్చిన ప్యాకెట్లు కొనుగోలు చేయొద్దు.
- బిల్లుపై విక్రయదారుని పేరు, ప్రభుత్వాల అమ్మకాల పన్ను నెంబర్‌, విక్రయదారుడి సంతకం, తేదీ, రకం పేర్లు, బ్యాచ్‌నంబర్‌, గడువు తేదీలు, నికర తూకం, ధర, కంపెనీ పేరు తప్పనిసరిగా నమోదు చేయాలి.
- కొనుగోలు చేసిన సరుకును డీలర్‌ వద్ద తూకం వేయించాలి.

పురుగుల మందు ఎంపికలో..

- పంటలో చీడపీడల నివారణకు వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సూచించిన పురుగుల మందులే వాడాలి.
- నిల్వ ఉంచిన పురుగుల మందులను వాడొద్దు. లైసెన్స్‌ ఉన్న దుకాణాల్లోనే కొనుగోలు చేయాలి.
- పురుగు మందు డబ్బాలపై చక్రా ఆకారంలో పురుగు మందు స్థాయిని తెలిపే రంగులు ఉంటాయి. అత్యంత విషపూరితమైతే నీలం రంగు, స్వల్ప విషపూరితమైతే డబ్బాలపై ఆకు పచ్చ రంగు గుర్తులు ఉంటాయి.
- ఒక పంటకు వాడిన పురుగుల మందును మరో పంటకు శాస్త్రవేత్తల సూచనలతో వాడాలి.

ఎరువులు కొనుగోలులో..

- లైసెన్స్‌ షాపుల్లోనే కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన బిల్లులు, ఖాళీ సంచులను పంట కాలం పూర్తయ్యే వరకు జాగ్రత్తగా ఉంచాలి.
- మిషన్‌ కుట్టుతో ఉన్న ఎరువుల సంచులు వాడాలి. ఒక వేళ చేతికుట్టుతో ఉంటే సీసం సీల్‌ ఉందో లేదో చూసుకోవాలి. ప్రామాణిక పోషకాల వివరాలు, ఉత్పత్తి సంస్థ, ఉత్పత్తిదారుడి పేరు కచ్చితంగా ఉండాలి.
- చిల్లలు పడి, చిరిగిన ఎరువుల బస్తాల కొనుగోలు చేయొద్దు. ఇతర పదార్థాలు కలిస్తే ఆ ఎరువును కల్తీగా గుర్తించాలి.

కల్తీ గుర్తించడం..

- యూరియా, కాల్షియం, అమ్మోనియం, నైట్రేట్‌ వంటి ఎరువుల గుళికలు రూపంలో ఉంటాయి. ఎరువుల ఇసుక రేణువుల రూపంలో, పొటాష్‌, సూపర్‌ఫాస్పేట్‌ పొడి రూపంలో ఉంటాయి.
- 5 మిల్లీ లీటర్ల నీటిలో చెంచా ఎరువును వేసి బాగా కలపాలి. ఇది స్వచ్ఛమైన ద్రావణంగా తయారైతే నాణ్యమైన ఎరువుగా గుర్తించవచ్చు. యూరియా, అమ్మోనియా క్లోరైడ్‌ ఎరువుల పరీక్షకు 10 మి.లీ పరిశుభ్రమైన నీటిని వినియోగించాలి.
- యూరియా వంటి ఎరువును ఒక చెంచాను 5 మి.లీ పరిశుభ్రమైన నీటిలో వేసి బాగా కలిపితే అడుగున మట్టి చేరితే కల్తీగా గుర్తించాలి. కొన్ని కాంప్లెక్స్‌ ఎరువులను ఇదే పద్ధతిలో పరీక్షిస్తే ఇసుక రేణువులు వచ్చే అవకాశముంది. అలా వస్తే కల్తీ ఎరువుగా గుర్తించాలి.

చరిత్రాత్మక ఒప్పందం సాధించాం

శ్రీరాంపూర్‌: బొగ్గుగని కార్మికులకు 11వ వేజ్‌బోర్డులో చరిత్రాత్మక ఒప్పందం సాధించామని ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్‌ బి.జనక్‌ప్రసాద్‌ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేతన ఒప్పందంలో ఐఎన్టీయూసీ చురుకైన పాత్ర పోషించిందని పేర్కొన్నారు. 19 శాతం మినిమం గ్యారెంటీ బెనిఫిట్‌, 25 శాతం అలవెన్సుల పెంపుతో వేతనాలు మెరుగ్గా పెరుగుతున్నాయని అన్నారు. ఈ ఒప్పందం వల్ల డెయిలీ రేటెడ్‌ కార్మికులకు రూ. 2.7 లక్షల నుంచి రూ.3.16 లక్షల వరకు ఏరియర్స్‌ వస్తాయని పేర్కొన్నారు. మంత్లీ రేటెడ్‌ కార్మికులకు రూ. 2.77 లక్షల నుంచి రూ. 4.91 లక్షలు వస్తాయని తెలిపారు.

బెల్లంపల్లి పీహెచ్‌డీ స్కాలర్‌కు జాతీయ అవార్డు


మహేశ్‌కుమార్‌

బెల్లంపల్లి: బెల్లంపల్లి చెందిన ఓ పీహెచ్‌డీ స్కాలర్‌కు ఆదివారం జాతీయ ఉత్తమ అవార్డు వరించింది. అంబేద్కర్‌ రడగం బాల బస్తీలో నివాసం ఉంటున్న సింగరేణి రిటైర్డ్‌ కార్మికుడి కుమారుడు రామగిరి మహేశ్‌ కుమార్‌ ఫిషరీ సైన్స్‌ విభాగంలో పీహెచ్‌డీ చేస్తున్నాడు. గుజరాత్‌ రాష్ట్రం అహ్మదాబాద్‌లోని గ్లేషియర్‌ జనరల్‌ రీసెర్చ్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో నేషనల్‌ అవార్డ్‌ ఆఫ్‌ ఎక్సలెన్స్‌–2023 గాను గ్లోబల్‌ మేనేజ్‌మెంట్‌ కౌన్సిల్‌ ఫిషరీ సైన్స్‌లో టీచింగ్‌, రీసెర్చ్‌, పబ్లికేషన్స్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా 'ఆదర్శ్‌ విద్యా సరస్వతీ రాష్ట్రీయ పురస్కార్‌' ఉత్తమ పీహెచ్‌డీ అవార్డుకు ఆయన ఎంపికయ్యాడు. దీంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు. తనకు ఉత్తమ అవార్డు రావడం పట్ల మహేశ్‌కుమార్‌ సంతోషం వ్యక్తం చేశారు. తాను పడిన కష్టానికి ప్రతిఫలం దక్కిందని 'సాక్షి'తో అన్నారు.

రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న ఏరియా జీఎం దేవేందర్‌

రెబ్బెన(ఆసిఫాబాద్‌): జూన్‌ 2న తెలంగాణ ఆవిర్భావ వేడుకలను ఏరియాలో ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ఏరియా జీఎం దేవేందర్‌ సూచించారు. గోలేటి టౌన్‌షిప్‌లోని తమ కార్యాలయంలో అన్ని విభాగాల ఉన్నతాధికారులతో వేడుకల ఏర్పాట్లపై సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ వేడుకల నిర్వహణ కోసం మైదానాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలన్నారు. స్వాగతం మొదలుకొని, ఉత్తమ ఉద్యోగుల ఎంపిక, క్రీడా పోటీలు, బహుమతులు సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటు ప్రతి అంశంపై అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఏరియా ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, పరిసర ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యేలా చూడాలని అన్నారు. సమావేశంలో ఎస్‌వోటూజీఎం కేహెచ్‌ఎన్‌ గుప్తా, ఏజీఎం తిరుమల్‌రావు, డీజీఎం సతీశ్‌బాబు, పీవో ఉమాకాంత్‌, పర్సనల్‌ మేనేజర్‌ లక్ష్మణరావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తే లక్ష్యం


మాట్లాడుతున్న రక్షణ జీఎం జాన్‌ ఆనంద్‌

జైపూర్‌: రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తే మన లక్ష్యంగా కార్మికులు ముందుకు సాగాలని బెల్లంపల్లి రీజియన్‌ రక్షణ జీఎం జాన్‌ ఆనంద్‌ తెలిపారు. జైపూర్‌ మండలం ఇందారం ఐకే–ఓసీపీపై సోమవారం రవాణా భద్రత అవగాహన పక్షోత్సవాలు పురస్కరించుకుని కార్మికులు, ఉద్యోగులకు రక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు రక్షణసూత్రాలు పాటిస్తూ సంస్థ అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. ఉద్యోగులు, యూనియన్‌ నాయకులు కలిసి కట్టుగా ప్రమాదాల నివారణకు రక్షణ సూత్రాలు పాటించినప్పుడే జీరో హార్మ్‌ సింగరేణిగా మార్చుకోవచ్చని తెలిపారు. అనంతరం ఉద్యోగులతో కలిసి రక్షణ ప్రతిజ్ఞ చేశారు. ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్‌, రక్షణాధికారి శ్రీధర్‌, అధికారులు విజయ్‌కుమార్‌, బ్రహ్మాజీరావు, రమేశ్‌, పిట్‌కార్యదర్శి రత్నాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంసీహెచ్‌లో నవజాత శిశువు మృతి

- వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యమే..
- ఆసుపత్రిలో తల్లిదండ్రులు, కుటుంబీకుల ఆందోళన


మృతి చెందిన నవజాత శిశువు


ఆర్‌ఎంవో డాక్టర్‌ భీష్మకు వినతిపత్రం అందిస్తున్న శిశువు తండ్రి రమేశ్‌


పగిలిన ఆసుపత్రి అద్దాలు

మంచిర్యాలటౌన్‌: జిల్లాకేంద్రంలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో సరైన చికిత్స అందక మూడు రోజుల నవజాత శిశువు సోమవారం మృతిచెందింది. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యమే కారణమంటూ శిశువు తల్లిదండ్రులు, కుటుంబీకులు ఆసుపత్రిలో ఆందోళనకు దిగారు. ఆసుపత్రి అద్దాలను పగులగొట్టారు. సమాచారం అందుకున్న మంచిర్యాల పోలీసులు అక్కడికి చేరుకుని వారితో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. పాప మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఎంసీహెచ్‌ ఇన్‌చార్జి, ఆర్‌ఎంవో డాక్టర్‌ భీష్మకు శిశువు తల్లిదండ్రులు వినతిపత్రం అందించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. హాజీపూర్‌ మండలం దొనబండకు చెందిన కూలీ పని చేసుకునే మానుపాటి రమేశ్‌ తన భార్య లావణ్య ప్రసవం కోసం ఈనెల 19న మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో చేర్పాడు. అదేరోజు సాయంత్రం సాధారణ ప్రసవం జరగ్గా, పాప జన్మించింది. ఈనెల 20న రాత్రి నుంచి పాపకు తీవ్ర జ్వరం రాగా, డాక్టర్‌ వద్దకు వెళ్తే అందుబాటులో లేరు. డ్యూటీలో ఉన్న నర్సు సిరప్‌ ఇచ్చింది. తగ్గకపోవడంతో 21న పాపకు సిరప్‌ ఇవ్వగా, సాయంత్రం 6 గంటలకు డాక్టర్‌ వద్దకు తీసుకెళ్లగా మరోటి సిరప్‌ ఇచ్చారు. రాత్రి జ్వరం తీవ్రం కావడంతో బాక్సులో పెట్టారు. వైద్యులు డ్యూటీకి రాలేదని, ఉదయం పరీక్షిస్తారని నర్సులు చెప్పారు. సోమవారం విధులకు హాజరైన వైద్యుడు పాపను పరిశీలించి మృతిచెందిందని నిర్ధారించారని, సరైన సమయంలో వైద్యం అందిస్తే బతికేదని తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమయ్యారు. పాప మృతికి బాధ్యులపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని డిమాండ్‌ చేశారు.

వైద్యులు ఎప్పుడు వస్తరో తెలీదు..

ఆసుపత్రిలో పలువురి బాలింతల కుటుంబ సభ్యులు మాట్లాడుతూ పిల్లల వైద్యులు ఎప్పుడు వస్తారో తెలియడం లేదన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. ప్రసూతి వరకు వైద్యం బాగానే చేస్తున్నా, పిల్లలకు వైద్యం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఎంసీహెచ్‌లో నలుగురు పిల్లల వైద్యులు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం ఇద్దరే ఉన్నారు. సాధారణ ప్రసవాలపై పెడుతున్న దృష్టి, పుట్టిన పిల్లలకు వైద్యం అందించడంలో చూపించడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

కాలువలోకి దూసుకెళ్లిన బైక్‌

- నీటిలో మునిగి భార్య మృతి
- ప్రాణాలతో బయటపడిన భర్త


వడై సాక్రుబాయి(ఫైల్‌)

వాంకిడి: అదుపుతప్పిన బైక్‌ ప్రమాదవశాత్తు కుమురంభీం ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాలువలో దూసుకెళ్లిన ఘటనలో భార్య మృతిచెందగా, భర్త ప్రాణాలతో బయటపడ్డాడు. మండలంలోని ఇందాని(మోకాసిగూడ) సమీపంలో ఈ ఘటన సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై డి.సాగర్‌ కథనం ప్రకారం .. మండలంలోని లెండిగూడ గ్రామానికి చెందిన వడై ఇంద్రాజీ–సాక్రుబాయి(28) దంపతులు గత 9 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. మూడేళ్ల క్రితం బాబు పుట్టిన వెంటనే చనిపోయాడు. అప్పటి నుంచి మళ్లీ సంతానం కలగకపోవడంతో పిల్లల కోసం గత మూడు నెలల నుంచి బెండార శివారులో గల శంకరుని ఆలయంలో ప్రతీ శని, సోమవారాలు పూజలు నిర్వహించేవారు. ఎప్పటిలాగే సోమవారం ఉదయం 5.30 గంటలకు ఇంద్రాజీ, సాక్రుబాయి దంపతులు బెండార శంకరుని గుడికి వెళ్లేందుకు బైక్‌పై బయల్దేరారు. కుమురంభీం ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ మీదుగా ఉన్న బీటీ గుండా వెళ్తుండగా మోకాసి గూడ–సరాండి గ్రామాల మధ్యలో ఉన్న మూలమలుపు వద్ద బైక్‌ అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లింది. బైక్‌తోపాటు ఇద్దరు నీటిలో మునిగారు. ఇంద్రాజీకి ఈత రావడంతో వెంటనే తేరుకుని భార్యను ఒడ్డుకు తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేశాడు. కాలువకు సిమెంటు లైనింగ్‌ ఉండటంతో నీళ్లలో నుంచి బయటికి రాలేకపోయాడు. కొంత సమయానికి అటుగా వెళ్తున్న ఓ వ్యక్తి సహాయంతో భార్యను బయటికి తీసుకొచ్చాడు. కానీ అప్పటికే సాక్రుబాయి మృతి చెందింది. కాలువలో నీళ్లతో పాటు నాచు, పూడిక అధికంగా ఉండటంతో బాధితులు బయటపడటంలో ఆలస్యమై ఉంటుందని అక్కడున్న వారు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. నీటిలో మునిగిన బైక్‌ను పోలీసులు స్థానికుల సహాయంతో బయటికి తీశారు. మృతురాలి తండ్రి ఆదె మోతీరాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఐదు సమస్యల గుర్తింపు

- 'ధరణి'పై 'సాధిక్‌ ఫౌండేషన్‌' అధ్యయనం
- జిల్లాలో రెండు మండలాల్లో అభిప్రాయాల సేకరణ


'సాధిక్‌ ఫౌండేషన్‌' ఆధ్వర్యంలో ధరణి పోర్టల్‌పై అభిప్రాయ సేకరణ

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన రెవెన్యూ పోర్టల్‌ 'ధరణి'లో భూ సమస్యలు ఎదురవుతున్న నేపథ్యంలో హైదరాబాద్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థ 'సాధిక్‌ ఫౌండేషన్‌' అధ్యయనం చేసింది. ఈ నెల 19, 20, 22 తేదీల్లో లక్సెట్టిపేట మండలం ఇటిక్యాల, వెంకటాపురం, ముత్యంపేట గ్రామాలు, దండేపల్లి మండలం కోయపోచగూడ గ్రామస్తులను కలసి భూ వివాదాలపై వివరాలు సేకరించారు. ఈ మూడు గ్రామాల్లో ప్రధానంగా ఐదు సమస్యలు గుర్తించారు. ఆ సమస్యల పరిష్కారం చూపేలా ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని జిల్లా అడిషనల్‌ కలెక్టర్‌కు నివేదిక అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్‌ చైర్మన్‌ సాధిక్‌ అలీ 'సాక్షి'తో మాట్లాడారు. జిల్లాలో ఏర్పడిన ఐదు భూ సమస్యలపై వివరించారు.

సమస్యలివీ

- ధరణి పోర్టల్‌లో కబ్జా కాలం లేకపోవడంతో ఏళ్లుగా భూమిపై కాస్తులో ఉన్న వారికి హక్కులు లేకుండా పోతోంది.
- పట్టా మార్పిడికి పాత పట్టాదారులు డబ్బులు డిమాండ్‌ చేయడం, లేక తిరుగుబాటు చేస్తున్నారు.
- వారసత్వ పట్టా చేసుకోవాలంటే ఆ కుటుంబ సభ్యులు అందరూ రావాలంటే సమస్యలు తలెత్తున్నాయి. తమ వాటాల కోసం వారసుల మధ్య తగాదాలు వస్తున్నాయి.
- పోడు సంబంధించిన ఎటువంటి మాడ్యూల్‌, పీసా చట్టం లేకపోవడంతో గిరిజనులకు ఎదురవుతున్న ఇబ్బందులు
- భూ సర్వేలు సమగ్రంగా అంటే ప్రభుత్వం చెప్పినట్లు అక్షాంశాల, రేఖాంశాల జరగకపోవడంతో హద్దుల మధ్య తగాదాలు
- పట్టణాలు, గ్రామాల్లో వెలిసిన వెంచర్లలో 'నాలా' లేకుండా ఉన్న ప్లాట్ల గతంలో ఉన్న పట్టాదారు పైనే భూములు ఉండడం. రైతుబంధు కోసం, ఇతర పథకాల కోసం కోర్టులకు వెళ్లి ఆర్డర్లు తెచ్చుకుని ఇబ్బందులు పెడుతున్నారు.

అటవీశాఖ అధికారుల ఆంక్షలు సడలించాలి


ఎమ్మెల్యేతో కలిసి మంత్రి ఐకేరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న మేదరి కులస్తులు

జన్నారం: కులవృత్తిని నమ్ముకుని జీవిస్తున్న మేదరి కులస్తులపై అటవీ శాఖ అధికారుల ఆంక్షలు సడలించాలని కోరుతూ మంత్రి ఐకేరెడ్డికి ఖానాపూర్‌ ఎమ్మెల్యే రేఖానాయక్‌తో కలిసి మేదరి కులస్తులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేంద్ర సంఘ నాయకులు మాట్లాడుతూ వెదురు వృత్తిదారులపై అటవీ అధికారుల దాడులు ఆపాలని, వెదురుద్వారా తయారు చేసిన వస్తువుల అమ్మకంలో ఆంక్షలు ఎత్తివేయాలని కోరారు. డబుల్‌ బెడ్రూం ఇళ్ల మంజురులో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇతర రాష్ట్రాల మాదిరిగా మేదరి కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరారు. అదేవిధంగా జన్నారం మండల వ్యాపారుల ఇబ్బందులను గుర్తించి భారీ వాహనాలను ఉదయం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు రాకపోకలకు అనుమతి ఇవ్వాలని ప్రజాప్రతినిధులు కోరారు. వైస్‌ ఎంపీపీ వినయ్‌కుమార్‌, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు జాడి గంగాధర్‌, ఎంపీటీసీ రియాజొద్దీన్‌, మహేంద్ర సంఘం ఉపాధ్యక్షుడు చిలువేరు నర్సయ్య, నాయకులు పిల్లి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్‌ ముట్టడి

మంచిర్యాలఅగ్రికల్చర్‌: సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో వీవోఏలు సోమవారం కలెక్టరేట్‌ ముట్టడించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి, ఐకేపీ వీవోఏల జిల్లా గౌరవ అధ్యక్షుడు దుంపల రంజిత్‌ కుమార్‌ మాట్లాడుతూ న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌ చేస్తూ 36 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని తెలిపారు. వీవోఏలకు కనీస వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఆన్‌లైన్‌ పనులు రద్దు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుంటాల కుమార్‌, లింగంపల్లి వెంకటేష్‌, రమాదేవి, రజిత, పుట్టపోషం, అన్వార్‌, అలీమ్‌, సురేష్‌, వెంకటేష్‌ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎన్‌హెచ్‌ ఉన్నతాధికారుల రాక

- ఎన్‌హెచ్‌ బాధితుల డిమాండ్లపై ఆరా
- విస్తరణ విషయంలో నివేదిక అందించాలని అధికారులకు కేంద్రమంత్రి నితిన్‌ గడ్కరీ ఆదేశం

మంచిర్యాలరూరల్‌(హాజీపూర్‌): మంచిర్యాల–ఆర్మూర్‌ వరకు నాలుగు వరుసల జాతీయ రహదారి 63 విస్తరణ రహదారి సర్వే పనులు నిలిపివేయాలంటూ ఎన్‌హెచ్‌ బాధితులు గత 20 రోజులుగా నిరసన దీక్ష చేపడుతున్నారు. ఓ వైపు దీక్ష చేపడుతూనే ప్రస్తుతం విస్తరణకు సంబంధించి రోడ్డు ప్లాన్‌ను మార్చి తమకు న్యాయం చేయాలని కోరుతూ ఎమ్మెల్యేలు, ఎంపీల నుంచి మొదలు రాష్ట్ర, కేంద్రమంత్రులు, ఎన్‌హెచ్‌ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ క్రమంలో ఇటీవల కేంద్ర రోడ్లు, రవాణా శాఖా మంత్రి నితిన్‌ గడ్కరీని కలిసిన నేపథ్యంలో విస్తరణ విషయంలో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పూర్తి నివేదిక అందించాలని ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం ఎన్‌హెచ్‌ రీజినల్‌ ఆఫీస్‌ హైదరాబాద్‌ నుంచి ఉన్నతాధికారులు జిల్లాకు రానున్నారు. వీరితో పాటు జిల్లా ఎన్‌హెచ్‌ఏఐ పీడీ కె.ఎం.అజయ్‌మణికుమార్‌ కూడా పాల్గొననున్నారు. ఎన్‌హెచ్‌ బాధితులను నేరుగా కలిసి రహదారి విస్తరణలో తలెత్తుతున్న సమస్యలు, ఇబ్బందులను పరిశీలించి నివేదికను కేంద్రానికి అందజేయనున్నారు.